సాక్షి
కాకినాడ
బుధవారం । 13 । డిసెంబర్ । 2023



రైతు సేవలో 75 వసంతాలు


పొగాకు రైతుల ఆర్థిక అభ్యున్నతికి తోడ్పాటు అందిస్తున్న కేంద్ర పొగాకు పరిశోధన సంస్థ (సీటీఆర్ఐ) ప్లాటినం జూబ్లీ వేడుక బుధవారం రాజమహేంద్రవరంలో జరగనుంది. - 8లో



రూ.1,01,116 విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి క్షేత్రంలో వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి అనంతనేని జగదీష్‌బాబు (విజయవాడ) మంగళవారం రూ.1,01,116 విరాళం సమర్పించారు.

డెల్టాలకు 5,100 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి డెల్టా కాలువలకు మంగళవారం 5,100 క్యూసెక్కుల గోదావరి నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 1,800, మధ్య డెల్టాకు 300, పశ్చిమ డెల్టాకు 3 వేల క్యూసెక్కుల చొప్పున వదిలారు. సముద్రంలోకి 12,124 క్యూసెక్కుల మిగులు జలాలు విడిచిపెట్టారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులుగా నమోదైంది.

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జిగా జమ్మలమడక



కాకినాడ: వైఎస్ఆర్ సీపీ మహిళా విభాగం జోనల్ ఇన్‌చార్జిగా జమ్మల మడక నాగమణి నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆమోదంతో పార్టీ కేంద్ర కార్యాలయం ఆమె నియామకాన్ని ప్రకటించింది. ప్రస్తుతం ఆమె రాష్ట్ర మహిళా కార్యదర్శిగా, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా కూడా పనిచేస్తున్నారు. అలాగే కాకినాడ జిల్లాకు చెందిన మరో ఇద్దరిని రాష్ట్ర యువజన విభాగంలో నియమించారు. కార్యదర్శిగా సానా నాగబాబు, సంయుక్త కార్యదర్శిగా మరద హేమంత్‌కుమార్ నియమితులయ్యారు. వీరి నియామకాలను కూడా పార్టీ కేంద్ర కమిటీ ఖరారు చేసింది.

నేటితో ముగియనున్న మహాశక్తి యాగం



శ్రీపీఠంలో మహాశక్తియాగ రక్షకుడు హనుమంతుడికి లక్ష అరటి పండ్లతో అర్చన

కాకినాడ రూరల్: మహాశక్తి యాగం పూర్తవ్వడంతో యాగ రక్షకుడు హనుమంతుడికి పరిపూర్ణనంద స్వామి ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా లక్ష అరటి పండ్లతో అర్చన నిర్వహించారు. స్వామిజీ పిలుపు మేరకు భక్తులు ఒక్కొక్కరూ తొమ్మిది అరటి పండ్లను తీసుకువచ్చారు. ఉపాసకులు సన్నిధానం చిదంబర శాస్త్రి ఈ కార్యక్రమం నిర్వహించారు. మహాశక్తి యాగం బుధవారం పూర్ణాహుతితో ముగియనుంది. 29వ రోజు మంగళవారం ఉదయం అనురాధ నక్షత్ర పూజలు నిర్వహించారు. మహిళలతో ఒక విడత లలితా సహస్ర కుంకుమార్చనలు నిర్వహించడంతో 108 కోట్ల లలితా కుంకుమార్చనల మైలు రాయి చేరుకుంది. అలాగే కోటి బగళాముఖి జపం పూర్తయ్యింది. ఇందులో ఎమ్మెల్యే ద్వారంపూడి పాల్గొన్నారు. అతిరుద్రం, గాయత్రి నక్షత్ర జపం పూర్తయ్యాయి. సాయంత్రం కోటి దీపోత్సవం, బగళాముఖి హోమం ఘనంగా నిర్వహించారు. ఉదయం కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా అహోబిల జీయ ర్ స్వామి హాజరయ్యే భక్తులకు ఆధ్యాత్మిక సందేశం ఇచ్చారు. సాయంత్రం దీపోత్సవ వేదికపై చావలి సూర్య కుమారి బృందం సంగీత కచేరితో అలరించింది. ఆంజనేయ స్వామికి అర్చన కార్యక్రమంలో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, ఆయన సోదరుడు కల్యాణ కృష్ణ పాల్గొన్నారు. భక్తుల సహకారంతో మహాశక్తి యాగం విజయవంతయ్యింది. పూర్ణాహుతిలో లక్ష బూరెలను నివేదిస్తారు.

15న జగ్గంపేటలో జాబ్ మేళా

జగ్గంపేట: ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 15న స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డి.హరిశేషు తెలిపారు. సుమారు 13 కంపెనీల్లో దాదాపు 500 ఉద్యోగ అవకాశాలు ఉన్నట్టు చెప్పారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, ఐటీఐ, ఎంబీడీ, ఫార్మసీ, ఎంబీఏ, ఎంకాం విద్యార్హత అవసరమన్నారు. 18 నుంచి 35 ఏళ్ల వారు అర్హులన్నారు. నెలకు రూ.10 వేల నుంచి రూ.25 వేల వరకు వేతనం ఉంటుందన్నారు. 82477 88247, 90107 37998 నంబర్లకు ఫోన్ చేసి వివరాలు పొందవచ్చునన్నారు. బయోడేటా, ఆధార్, అడ్రస్ ప్రూఫ్, విద్యార్హత సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు.

ముగిసిన కళా ఉత్సవ్

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని జిల్లా ప్రభుత్వ విద్యాశిక్షణాసంస్థ(డైట్)లో రెండురోజుల పాటు జరిగిన ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా స్థాయి కళాఉత్సవ్ పోటీలు మంగళవారంతో ముగిశాయి. చిత్రలేఖనం,మట్టితో బొమ్మల తయారీ,సాంప్రదాయ ఆటబొమ్మల తయారీ, ఏకపాత్రాభినయం విభాగాల్లో జిల్లాస్థాయి కళా ఉత్సవ్ పోటీలను డైట్ ప్రిన్సిపాల్ డా.ఎస్‌డీవీ రమణ ప్రారంభించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని తొమ్మిది పాఠశాలల నుంచి 22మంది బాలబాలికలు పోటీలలో పాల్గొన్నారని రమణ తెలిపారు. బాలబాలికలలో అంతర్లీనంగా దాగి ఉన్న కళా నైపుణ్యాలు వెలికితీయటానికి ఈ పోటీలు దోహదపడతాయన్నారు. రెండు రోజులు జరిగిన ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా కె.టి.సుబ్బరాయన్,ఎం.నాగేశ్వరరావు,కరణం సూకరాజు,పి.పి.యస్.జోగన్న శాస్త్రి వ్యవహరించారు. అధ్యాపకులు సూర్యనారాయణ, సత్యనారాయణ, బాలరాజు,జానకీదేవి,ఎస్తర్,కళావతిలు పాల్గొన్నారు.



ద్రాక్షారామ భీమేశ్వరస్వామి సన్నిధిలో దీపోత్సవం



అన్నవరం సత్యదేవుని సన్నిధిలో భక్తజనసందోహం



మురమళ్ల వీరేశ్వరస్వామి సన్నిధిలో కార్తిక దీపోత్సవం



వేలాదిగా తరలి వచ్చిన భక్తులతో కిక్కిరిసిన వాడపల్లి క్షేత్రం

కార్తికాన.. కాసుల వాన

- కలిసొచ్చిన ఆధ్యాత్మిక మాసం
- ఆలయాలకు క్యూ కట్టిన భక్తులు
- కానుకలతో నిండిన హుండీలు
- గత ఏడాదితో పోల్చితే పెరిగిన ఆదాయం
- ముగిసిన కార్తిక మాసోత్సవాలు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: పల్లె, పట్టణం అనే తేడా లేకుండా భక్తిపారవశ్యంతో ఉప్పొంగిపోయింది. ఆధ్యాత్మికతకు పెట్టింది పేరు ఉమ్మడి తూర్పుగోదావరి. గోదావరి, గౌతమి, వృద్ధ గౌతమి, వైనతేయ, వశిష్ట వంటి పవిత్ర నదులకు నిలయం మన సీమ. ఇందులో ఏ తీరాన అడుగిడినా ఆధ్యాత్మికత పరిఢవిల్లుతుంది. అటువంటి పవిత్ర నేలపై కార్తిక మాసమంతా భక్తజనం దైవచింతనలో మునిగి తేలారు. సమీపాన ప్రసిద్ధి చెందిన ఆలయాలను దర్శించుకుని భక్తిపరవశులయ్యారు. వాస్తవానికి ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి ఉమ్మడి తూర్పులోని ఆలయాలకు భక్తులు నిత్యం వస్తూంటారు. హరిహరులకు ప్రీతిపాత్రమైన మాసంగా పరిగణించే కార్తికం అనేసరికి భక్తుల తాకిడి మరింత ఎక్కువగా ఉంటుంది. ఈ నెలంతా అన్ని వయసుల వారూ లక్షలాదిగా పరమ శివుడి ఆశీస్సుల కోసం బారులు తీరారు. మహిళలు ఉపవాసాలు పాటించారు. భక్తిశ్రద్ధలతో కుంకుమార్చనలు, దీపారాధనలు నిర్వహించారు. పంచారామ క్షేత్రాల సందర్శనకు వచ్చిన భక్తులు సమీపంలోని అన్ని ప్రముఖ ఆలయాలనూ కూడా దర్శించుకోవడం పరిపాటి. గత నెల 12న శుద్ధ పాడ్యమితో ప్రారంభమైన కార్తిక మాసం మంగళవారం అమావాస్యతో ముగిసింది.

అన్నవరం.. అగ్రస్థానం

- కార్తిక మాసంలో ఆదాయార్జనలో అన్నవరం సత్యదేవునిదే పైచేయి. ఈ స్వామిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. సుమారు రూ.20 కోట్ల మేర ఆదాయం వచ్చిందని అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. గత ఏడాది ఇదే మాసంతో పోలిస్తే తగ్గేదే లేదన్నట్టు ఆదాయం సమకూరింది. తుపాను, తెలంగాణ ఎన్నికల నేపథ్యంలో భక్తుల సంఖ్య స్వల్పంగా తగ్గింది. గత ఏడాది కార్తికంలో 1,42,378 వ్రతాలు జరిగితే ఈసారి 1,25,000 జరిగాయి. గత ఏడాది సుమారు 25 లక్షల మంది భక్తులు రాగా, ఈ ఏడాది కాస్త అటూ ఇటుగా రెండు మూడు లక్షలు తగ్గి ఉంటారని అంచనా.



మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయంలో భక్త జనసందోహం

ఆలయం	ఆదాయం (రూ.లలో)	దర్శించుకున్న భక్తులు
అన్నవరం	20,00,00,000.00	23,00,000
సామర్లకోట	71,84,761.00	5,00,000
ద్రాక్షారామ	95,63,879.00	5,00,000
పిఠాపురం	36,00,000.00	3,50,000
వాడపల్లి	2,28,83,393.00	3,00,000
అంతర్వేది	63,86,127.00	2,00,000
అయినవిల్లి	59,37,586.00	1,50,000
అప్పనపల్లి	75,55,623.00	59,827
మురముళ్ళ	52,87,416.00	1,00,000
తలుపులమ్మ	18,000.00	80,00,000
మొత్తం	22,28,83,393.00	45,39,827

ఆలయాలన్నింటా సందడి

విశేష ఖ్యాతిని ఆర్జించిన అన్నవరం సత్యనారాయణస్వామి, విఘ్నాలు లేకుండా చేసే అయినవిల్లి విఘ్నేశ్వరుడు, పంచారామ క్షేత్రాలైన ద్రాక్షారామ మాణిక్యాంబ కుమార భీమేశ్వరస్వామి, సామర్లకోట భీమేశ్వరస్వామి, వృద్ధ గోదావరి తీరాన మురమళ్ల భద్రకాళీసమేత వీరేశ్వరస్వామి, గౌతమి తీరాన పురాతన చరిత్ర కలిగిన కుండలేశ్వరుడు, ఆత్రేయపురం వాడపల్లి వెంకన్న, అప్పనపల్లి బాలబాలాజీ స్వామి, అంతర్వేది శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి, పిఠాపురం పాదగయ వంటి క్షేత్రాలను ఈ నెల రోజులూ భారీ సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఈ నెలలో ప్రతి సోమవారం తండోపతండాలుగా తరలివచ్చారు. హుండీలలో కానుకలతో పాటు కాసుల వర్షం కురిపించారు. ఇవే కాకుండా ప్రసాదాలు, విరాళాలు, మొక్కులతో స్వామివార్లకు కాసులు గలగలలాడాయి. హుండీల ఆదాయం లెక్కింపు పూర్తి కావాల్సి ఉంది. ఆ ప్రక్రియ కూడా పూర్తయితే ఆదాయం మరింత పెరుగుతుందని దేవదాయ అధికారులు చెబుతున్నారు.

సమన్వయంతో పనిచేశాం



కార్తిక మాసం నెల రోజులూ భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. ఆలయాలకు రాలేని భక్తులు ఆన్‌లైన్‌లో కూడా ఎన్నో పూజలు జరిపించుకున్నారు. లక్షలాదిగా తరలివచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులూ ఎదురవకుండా ముందుగానే జాగ్రత్తలు తీసుకున్నాం. వసతి, ఇతర సేవలు విషయంలో సమన్వయంతో వ్యవహరించాం. ఎక్కడా ఒక్క సమస్య కూడా ఉత్పన్నం కాలేదు.

– కె.రామచంద్ర మోహన్, కార్యనిర్వహణాధికారి, అన్నవరం దేవస్థానం

- అన్నవరం తరువాతి స్థానంలో కోనసీమలోని వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం నిలుస్తోంది. ఈ మాసంలో సోమ, శనివారాల్లో భక్తులు భారీగా తరలి వచ్చారు. హుండీల్లో కానుకలు సమర్పించుకున్నారు. వేంకటేశ్వరస్వామికి అన్ని రకాల కానుకలతో రూ.2,28 కోట్ల ఆదాయం సమకూరింది. లడ్డూ విక్రయాల ద్వారానే రూ.40,17,840 ఆదాయం రావడం విశేషం. గత ఏడాది కార్తిక మాసంలో వచ్చిన ఆదాయం కంటే ఈసారి కోటి రూపాయలు అదనంగా ఆదాయం వచ్చింది.
- వృద్ధ గౌతమి తీరాన కొలువైన మురమళ్ల వీరేశ్వరస్వామిని లక్ష మందికి పైగా భక్తులు దర్శించుకున్నారు. నిత్యకల్యాణ సేవ ద్వారానే వీరేశ్వరస్వామికి రూ.37.17 లక్షల మేర ఆదాయం వచ్చింది.
- ద్రాక్షారామ, సామర్లకోటల్లోని పంచారామ క్షేత్రాలను రెండు మూడు లక్షల మంది భక్తులు దర్శించుకున్నారు.
- ప్రసిద్ధి చెందిన ఆలయాలన్నీ కలిపి రికార్డు స్థాయిలో సుమారు రూ.22 కోట్ల మేర ఆదాయం వచ్చింది.
- కానుకలు, అన్నప్రసాద విరాళాలు, ప్రత్యేక దర్శనాలు, శీఘ్రదర్శనాలతో వచ్చిన ఆదాయం ఆలయాలకు సరికొత్త శోభనివ్వనుంది.

ముగిసిన దొరబాబు పాదయాత్ర



సామర్లకోట నుంచి తొలి తిరుపతికి పాదయాత్రగా దొరబాబు తదితరులు

సామర్లకోట: రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి 2024లో కూడా ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తూ రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు పెద్దాపురం మండలం తొలి తిరుపతికి చేస్తున్న పాదయాత్ర మంగళవారం ముగిసింది. సామర్లకోటలోని స్వగృహం నుంచి ఇండస్ట్రియల్ ఎస్టేట్, జగనన్న కాలనీ మీదుగా తొలి తిరుపతి చేరుకుని ఆయన శృంగార వల్లభస్వామికి పూజలు చేశారు. ఏడు రోజుల పాటు పాదయాత్రగా తొలి తిరుపతి వెళ్లాలని దవులూరి దొరబాబు నిర్ణయించుకున్నారు. దాంతో ఏడవ రోజు మంగళవారం నియోజకవర్గం నలుమూల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు అధిక సంఖ్యలో దొరబాబు ఇంటికి చేరుకున్నారు. రాష్ట్ర అయ్యరక కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఆవాల రాజేశ్వరి, జెడ్పీటీసీ సభ్యుడు గవరసాని సూరిబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు ఉబా జాన్ మోజెస్, నెక్కంటి సాయిప్రసాద్, అన్నవరం దేవ స్థానం ప్రత్యేక ఆహ్వానితులు మోరంపూడి శ్రీరంగనాయకులు నాయకులు, అభిమానులతో కలిసి 15 కిలోమీటర్ల మేర నడిచి తొలి తిరుపతి చేరుకున్నారు. అక్కడ శృంగార వల్లభస్వామికి మొక్కు తీర్చుకున్నారు. తొలి తిరుపతి పాదయాత్రగా వెళుతున్న తరుణంగా ఆయా గ్రామాల్లోని ఆలయాలను దొరబాబు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో జగన్ మోహన్‌రెడ్డి తిరిగి ముఖ్యమంత్రి అయ్యేలా దీవించాలని స్వామి వారిని కోరుకున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పెంకే సత్యవతి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులు ఆవాల లక్ష్మీనారాయణ, కంటే వీరరాఘవరావు, పెద్దాపురం గృహసారథుల కన్వీనర్ గోపు మురళీ, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఇనకొండ విష్ణుచక్రం, మార్కెట్ కమిటీ వైస్,చైర్మన్ లు మోరంపూడి రమేష్, బండారు వీరబాబు, కౌన్సిలర్లు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సాగర తీరాన శివనామ హోరు

ఘనంగా 48వ మహా కుంభాభిషేకం

కాకినాడ రూరల్: కాకినాడ సాగర తీరం మంగళవారం శివ నామస్మరణతో మార్మోగింది. హర హర మహాదేవ శంభో శంకరా..అంటూ భక్తులు నినదించారు. శంకరుడికి పవిత్ర జలాలతో అభిషేకాలు చేశారు. కుంభాభిషేకం రేవు వద్ద శివభక్తుడు సంకల్పంతో కళాబంధు డాక్టరు టి.సుబ్బిరామిరెడ్డి నిర్మించిన శ్రీ మంగళాంబికా సమేత ఆదికుంభేశ్వర స్వామి ఆలయంలో 48వ మహాకుంభాభిషేకం వైభవంగా జరిగింది. లోక కళ్యాణార్థం, ప్రకృతి విపత్తుల నుంచి దేశానికి ఉపశమనం కలిగించే శివ కేశవులకు మహా యజ్ఞంగా కార్తిక అమావాస్య సందర్భంగా కోటి 8లక్షల శివలింగాలకు అభిషేకం నిర్వహించారు. ఉదయం 7గంటలకు గోపూజ, అనంతరం విఘ్నేశ్వరపూజ, పంచకాటకం, వేద పఠనం, రసలింగేశ్వరునికి విభూదితో అభిషేకం, అనంతరం అభిషేక విభూది సముద్రంలో నిమజ్జనం వంటి క్రతువులు నిర్వహించారు. పాదరస లింగానికి మహాకుంభాభిషేకం తోట పుండరీకాక్షులు(బాబీ), శాంతాదేవి దంపతులు నిర్వహించారు. జూలుమూరి వెంకట రాజారావు(రాజశేఖర్) దంపతులు శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి వారికి మహాకుంభాభిషేకం నిర్వహించగా, ఈర్ల వెంకట శివరావు సోదరులు ఆదికుంభేశ్వరుడి బిల్వార్చన చేశారు. వేలాదిగా హాజరైన భక్తులకు దుమ్ములపేట మత్స్యకారులు, చేపల వ్యాపారులు, దాతలు సహకారంతో భారీ అన్నదానం చేశారు. అనంతరం లలితా సహస్ర నామాలలో కుంకుమార్చన, 3గంటలకు మంగళాంబికా సమేత ఆదికుంభేశ్వర స్వామికి కల్యాణం, హోమం, పూర్ణాహూతి నిర్వహించారు. సాయంత్రం 4గంటలకు 101కన్యలతో సాగర నిమజ్జనం చేశారు. యాగంలో ఉపయోగించిన పసుపుతాళ్లను పంపిణీ చేశారు. ఆలయ కమిటీ, భారత యజ్ఞపీఠం కమిటి సభ్యులు భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు.



కోటి 8లక్షలు శివలింగాలకు మహాకుంభాభిషేకం



ఆలయం వద్ద దర్శనాలకు బారులుతీరిన భక్తులు



కుంభాభిషేకం రేవు వద్ద పాదరస శివలింగానికి మహాకుంభాభిషేకం చేస్తున్న తోట పుండరీకాంక్షులు(బాబీ), శాంతాదేవి దంపతులు

చురుగ్గా టీకా కార్యక్రమం

- కొరత లేకుండా వ్యాక్సిన్లు సరఫరా
- నూరు శాతం లక్ష్యంగా ఇంద్రధనస్సు ప్రారంభం
- 1.45 లక్షల మంది చిన్నారులకు టీకాలు



టీకాలు వివరాలు తెలిపే చార్టు



చిన్నారులకు టీకాలపై వైద్యసిబ్బందితో చర్చిస్తున్న ఇమ్యూనైజేషన్ అధికారి రత్నకుమార్.

కాకినాడ సిటీ: ప్రాణాంతకమైన తొమ్మిది వ్యాధుల నుంచి ప్రజలను కాపాడేందుకు ప్రభుత్వం నడుం బిగించింది. ఇందులో భాగంగా పుట్టిన వెంటనే రక్షణ కల్పించేందుకు ఉద్దేశించిన టీకాల కార్యక్రమాన్ని జిల్లా యంత్రాంగం సమర్థవంతంగా అమలు చేస్తోంది. అయినప్పటికీ అక్కడక్కడ కొందరు చిన్నారులు వ్యాక్సిన్ వేసుకోకుండా మిగిలిపోతున్నారు. వారిని గుర్తించి వ్యాక్సిన్లు వేసేందుకు ప్రభుత్వం మిషన్ ఇంద్ర ధనస్సుపేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈనెల 11 నుంచి 16 వరకు జిల్లాలోని ప్రభుత్వాస్పత్రులు, పీహెచ్‌సీల్లో ఉచితంగా టీకాలు వేయనున్నారు. దీని కోసం వైద్య సిబ్బంది ఊరూరా జల్లెడ పడుతున్నారు.

శిశువుల నుంచి కొంచెం వయసున్న పిల్లల వరకూ అవసరమైన టీకాలను ఉచితంగా వేస్తున్నారు. ధనుర్వాతం, క్షయ, కోరింత దగ్గు, పోలియో, హెపటైటిస్-బీ, చికెన్ పాక్స్ వంటి వ్యాధుల నుంచి రక్షణకు టీకాలు వేస్తారు. గతంతో టీకా వేయించుకోవాలంటే పిల్లలు భయపడేవారు. తల్లిదండ్రులూ ఉత్సాహం చూపేవారు కాదు. ఇప్పుడు అవగాహన పెరిగింది. అపోహలు తొలగిపోతున్నాయి. ప్రతి ఒక్కరూ పిల్లలకు టీకాలు వేయడానికి ముందుకు వస్తున్నారు. దీంతో ఏటా 95 శాతం పైబడి వ్యాక్సినేషన్ జరుగుతోంది.


ప్రతి బుధ, శనివారాల్లో..

జిల్లాలోని 21 మండలాల్లో 44 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు 9 కమ్యూనిటీ ఆసుపత్రులు, ఒక ఏరియా ఆసుపత్రి, జిల్లా ఆసుపత్రులు ఉన్నాయి. వీటిలో ప్రతి నెల మొదటి బుధ, శనివారాల్లో వ్యాక్సినేషన్ వేస్తున్నారు. రెండో బుధ, శనివారాల్లో కూడా వ్యాక్సినేషన్ డే నిర్వహిస్తున్నారు. ప్రతి ఆరోగ్య కేంద్రానికి అవసరమైన టీకాలను జిల్లా ఇమ్యూనైజేషన్ కేంద్రం నుంచి అధికారులు చేరవేస్తున్నారు. ఆయా కేంద్రాల్లో టీకాలు నిల్వ ఉంచేందుకు ఫ్రిజ్‌లు పీహెచ్‌సీల్లో ఏర్పాటు చేశారు. మూడో విడత మిషన్ ఇంద్ర ధనస్సులో భాగంగా ఇంకా వ్యాక్సిన్లు వేసుకోకుండా డ్రాప్ అవుట్‌గా మిగిలిపోయిన 1354 మంది పిల్లలను గుర్తించారు. వారికి టీకాలు వేయనున్నారు. వంద శాతం వ్యాక్సిన్ల లక్ష్యం పూర్తికి చర్యలు తీసుకుంటున్నారు.

పిల్లల టీకాలు

- శిశువు జన్మించిన సమయంలో బీసీజీ, ఓపీవీ జీరో మోతాదు, హెపటైటీస్-బీ.
- పుట్టిన ఆరు వారాలకు ఓపీవీ-1, పెంటావాలెంట్-1, రోటా-1, ఎఫ్ఎల్‌పీవీ-1, పీసీవీ-1 పది వారాలకు ఓపీవీటపీవీ-2,పెంటావాలెంట్-2, రోటా-2
- పద్నాలుగు వారాలకు ఓపీవీ-3, పెంటావాలెంట్-3, రోటా-3, ఎఫ్ఎల్‌పీవీ-2, పీసీవీ-2 9 నెలలకు మీజిల్స్-1/ఎంఆర్-1, విటమిన్-ఎ, జేఈ-1, పీసీవీ-బీ
- 16 నుంచి 24 నెలలకు డీపీటీ మొదటి బూస్టర్ డోస్, ఓపీవీ బూస్టర్ డోస్, మీజిల్స్-2, జేఈ-2.
- 5 నుంచి ఆరేళ్లకు డీపీటీ రెండో బూస్టర్ మోతాదు. 10-16 సంవత్సరాలకు టీటీ వేస్తారు.

వ్యాక్సిన్ల కొరత లేదు



వంద శాతం మంది చిన్నారులకు వ్యాక్సినేషన్ వేయడానికి ఈనెల 11వతేదీ నుంచి మిషన్ ఇంద్రధనస్సు నిర్వహిస్తున్నాం. అప్పుడే పుట్టిన శిశువు నుంచి ఐదేళ్ల పిల్లల వరకు అవసరమైన అన్ని రకాల వ్యాక్సిన్లు ఎప్పటికప్పుడు సరఫరా చేస్తున్నాం. ఎక్కడా కొరత లేదు. ఇప్పుడు వైఎస్సార్ హెల్త్ క్లినిక్స్ అందుబాటులోకి వచ్చాయి. వ్యాక్సిన్లు వేయడం మరింత సులభమైంది. మిషన్ ఇంద్రధనస్సు విజయవంతానికి స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు సహకరించాలి.

కె. రత్నకుమార్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి

క్లుప్తంగా

గాయపడిన అయ్యప్ప భక్తుడికి ఆర్థిక సాయం



అయ్యప్ప భక్తుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న తోటి భక్తులు

నల్లజర్ల: వారందరూ అనంతపల్లి శివాలయం పీఠంలో అయ్యప్ప మాలలు ధరించి, యాత్ర ముగించుకుని తిరిగి వచ్చారు. వీరిలో చెప్పుల సుధాకర్ ఆదివారం రాత్రి తన భార్యతో బైక్‌పై నల్లజర్ల వెళ్తుండగా ట్రాక్టర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో భార్యాభర్తలిద్దరూ గాయపడ్డారు. భార్య నల్లజర్ల ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొంది, ఇంటికి వెళ్లగా.. భర్త సుధాకర్‌కు కంటి పైభాగంలో ఆపరేషన్ అవసరమని తాడేపల్లిగూడెం, రాజమహేంద్రవరం ఆసుపత్రుల వైద్యులు చెప్పారు. దీంతో చివరకు అతడిని ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్చారు. అక్కడ వైద్యం జరుగుతోంది. సుధాకర్‌తో పాటు అయ్యప్ప మాలలు ధరించిన తోటి భక్తులు అతడి దుస్థితి తెలుసుకుని చలించిపోయారు. వెంటనే గురుస్వామి తాతిన చైతన్య, బళ్ల నాని ద్వారా రూ.42,200 మొత్తాన్ని మంగళవారం సాయంత్రం బాధితుడి తండ్రి కంచేశ్వరరావుకు అందజేశారు.

మండల పరిషత్ కార్యాలయంలో విజిలెన్స్ తనిఖీలు



రికార్డులు తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

నల్లజర్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో విజిలెన్స్ అధికారులు మంగళవారం రికార్డులు తనిఖీ చేశారు. డీఎస్పీ పి.ముత్యాలనాయుడు ఆధ్వర్యాన సీఐ వెంకట్రాజు, ఎస్సై భార్గవ మహేష్‌లు ఈ తనిఖీల్లో పాల్గొన్నారు. తనిఖీ నివేదికను డీజీ కుమార్ విశ్వజిత్‌కు అందిస్తామని డీఎస్పీ తెలిపారు. మండల పరిషత్‌లో జనరల్ నిధులు దుర్వినియోగమయ్యాయని, లెక్కలు చూపకుండా సొమ్ములు డ్రా చేశారని, గ్రామ పంచాయతీ, మండల పరిషత్ ఎన్నికల్లో విధులు నిర్వహించిన సిబ్బందికి ఇవ్వాల్సిన సొమ్ములు సైతం ఇవ్వకుండా తినేశారని నల్లి రాజేష్ అనే వ్యక్తి గతంలో ఆరోపణలు చేశారు. దీనికి సంబంధించి గతంలో ఇక్కడ ఎంపీడీఓగా పని చేసిన వాణి, పరిపాలనాధికారి ప్రసాదరాజులపై విచారణ జరుగుతోంది. ఇందులో భాగంగానే విజిలెన్స్ అధికారులు రికార్డులు పరిశీలించారని ప్రస్తుత ఎంపీడీఓ రాజశేఖర్ తెలిపారు. ఈ ఆరోపణలపై విజిలెన్స్ అధికారులు రెండేళ్లుగా పలు దఫాలు మండల పరిషత్ కార్యాలయానికి వచ్చి రికార్డులు పరిశీలించారు. అప్పటి ఎంపీడీఓ వాణి ఒక్కసారి కూడా ఆడిట్‌కు హాజరు కాలేదు.

రైతు సేవలో 75 వసంతాలు

- పొగాకు సాగుదార్లకు సీటీఆర్ఐ తోడ్పాటు
- వారి ఆర్థికాభివృద్ధికి అడుగడుగునా సహకారం
- నేడు సంస్థ ప్లాటినం జూబ్లీ వేడుకలు



రాజమహేంద్రవరం భాస్కర్ నగర్‌లోని సీటీఆర్ఐ భవనం

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): మన రాష్ట్రంలో కాకినాడ జిల్లాలోని మెట్ట ప్రాంతాలు మొదలు గుంటూరు, ప్రకాశం జిల్లాల వరకూ పెద్ద మొత్తంలో నేలలు పొగాకు సాగుకు ఎంతో అనుకూలం. దీంతో ఈ ప్రాంతంలో మొదట్నుంచీ ఈ పంట సాగు అధికంగా జరుగుతోంది. దీనిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వేలాది మంది పొగాకు రైతులకు సేవలందించే లక్ష్యంతో దేశంలోనే తొలి సారిగా 1947లో రాజమహేంద్రవరం కేంద్రంగా కేంద్ర పొగాకు పరిశోధన సంస్థ(సీటీఆర్ఐ)ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అప్పట్లో పేపరు మిల్లు వద్ద ఉన్న ఈ కార్యాలయాన్ని తదనంతరం ప్రస్తుత జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి వెనుకన భాస్కర్ నగర్‌లోకి మార్చారు. ఇండియన్ సెంట్రల్ టొబాకో సెంటర్‌గా ఉన్న ఈ సంస్థ 1947లో సీటీఆర్ఐగా రూపాంతరం చెందింది. 1965లో భారత వ్యవసాయ పరిశోధన మండలి(ఐసీఏఆర్)లో చేరింది. సీటీఆర్ఐ తొలి డైరెక్టర్‌గా డాక్టర్ కదాం వ్యవహరించారు. ఆ తరువాత 11 మంది డైరెక్టర్లు ఈ సంస్థను పురోగతిలో నడిపించారు. కొత్త పొగాకు వంగడాలను రూపొందించడం, దిగుబడి పెంచడం, చీడపీడల నివారణ, యాంత్రీకరణ వేగవంతం చేయడం, నాణ్యమైన పొగాకు ఉత్పత్తి, ఎగుమతుల ద్వారా మన దేశానికి రూ.20 వేల కోట్ల మేర ఆదాయం తీసుకురావడం వంటి అనేక విజయాలను సీటీఆర్ఐ సాధించింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఆరు ప్రాంతీయ కేంద్రాల ద్వారా పొగాకు రైతులకు వివిధ సేవలు అందిస్తున్న ఈ ప్రతిష్ఠాత్మక సంస్థ రైతుల సేవలో 75 వసంతాలు పూర్తి చేసుకుంటోంది. ఈ నేపథ్యంలో రాజమహేంద్రవరం సీటీఆర్ఐ ఆవరణలో బుధవారం ప్లాటినం జూబ్లీ వేడుకలు నిర్వహిస్తున్నారు.



75 వసంతాల పైలాన్

మేలురకపు వంగడాల సృష్టి

ఇప్పటి వరకూ అధిక దిగుబడినిచ్చే 103 రకాల హైబ్రీడ్, మేలురకపు పొగాకు వంగడాలను సీటీఆర్ఐ తయారు చేసింది. ఇవి కాకుండా మరో 120 మేలురకపు వంగడాలను కూడా తయారు చేసింది. పంట ఉత్పత్తి, సస్యరక్షణకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు అందించింది. దేశవ్యాప్తంగా పొగాకు సాగుకు అవసరమైన విత్తనాల్లో 90 శాతం సీటీఆర్ఐ అందిస్తూండటం విశేషం. గత 75 సంవత్సరాల్లో అనేక ప్రతిష్ఠాత్మక అవార్డులు, గుర్తింపులు, పేటెంట్లు, కాపీరైట్లు సాధించింది. సుమారు 500 పరిశోధన పత్రాలు, 3,386 పొగాకు జెర్మ్ ప్లాస్మ్ నివేదికలు, సాంకేతిక వ్యాసాలు రూపొందించింది.

ఉత్పత్తి, ఎగుమతులకు ఊతం

ప్రపంచ వ్యాప్తంగా పొగాకు పంట విస్తీర్ణంలో మన దేశం 0.433 మిలియన్ హెక్టార్లతో 14 శాతం వాటా కలిగి ఉంది. అలాగే, 761 మిలియన్ కిలోల ఉత్పత్తితో ప్రపంచంలో 13 శాతం వాటాతో రెండో స్థానంలో ఉంది. సీటీఆర్ఐ కృషితో గడచిన ఏడు దశాబ్దాల్లో దేశవ్యాప్తంగా పొగాకు ఉత్పత్తి 275 మిలియన్ కిలోల నుంచి 761 మిలియన్ కిలోలకు (దాదాపు 2.8 రెట్లు) పెరిగింది. 1950–60 మధ్య హెక్టారుకు 732 కిలోల పొగాకు ఉత్పత్తి జరగగా అది 2010–2020 నాటికి ఏకంగా 1,720 కిలోలకు పెరిగింది. మన దేశంలో 18 పొగాకు రకాలు సాగవుతున్నాయి. ఎఫ్‌సీవీ, బర్లీ రకాలు ఎగుమతి కోసం సాగు చేస్తారు. మన దేశం నుంచి పొగాకు ఎగుమతులు 48 శాతం పెరగడం వెనుక సీటీఆర్ఐ కీలక పాత్ర పోషించింది. గడచిన ఆర్థిక సంవత్సరంలో పొగాకు ఎగుమతుల ద్వారా మన దేశం సుమారు రూ.9,740 కోట్లు, ఎక్సైజ్ రెవెన్యూ ద్వారా రూ.23,357 కోట్లు ఆర్జించింది.

వాణిజ్య వ్యవసాయంపై దృష్టి



"పొగాకుతో పాటు ప్రస్తుతం వాణిజ్య వ్యవసాయంపై దృష్టి సారించాం. ఇందులో భాగంగా పసుపు, మిర్చి, అశ్వగంధ, ఆముదం పంటలపై పరిశోధన, అభివృద్ధి చేస్తున్నాం. నికోటిన్ శాతం తగ్గకుండా, క్యాన్సర్ కారకాలు లేకుండా పొగాకు దిగుబడి సాధించేలా కొత్త వంగడాలకు రూపకల్పన చేస్తున్నాం. దేశంలోనే అత్యుత్తమ సంస్థగా ఎదగాలని భావిస్తున్నా."

– డాక్టర్ మాగంటి శేషుమాధవ్, డైరెక్టర్, సీటీఆర్ఐ, రాజమహేంద్రవరం

రైతు సేవలో..



పేపర్ మిల్లు వద్ద ఉన్న సీటీఆర్ఐ పాత భవనం

- మెరుగైన ఉత్పాదకత, దేశంలోని వివిధ వ్యవసాయ – వాతావరణ – భౌగోళిక పరిస్థితులకు అనువుగా అధిక దిగుబడినిచ్చే నాణ్యమైన విత్తనాలు రూపొందించడం, వీటిని రైతులకు సకాలంలో అందించడం, మేలైన యాజమాన్య పద్ధతులు, శాస్త్రీయ సాంకేతిక సలహాల ద్వారా స్థిరమైన పొగాకు ఉత్పత్తికి సీటీఆర్ఐ తోడ్పాటు అందిస్తోంది.
- వర్జీనియా పొగాకు సాగు చేసే నేలల్లో సమగ్ర పోషకాల యాజమాన్యం, సమగ్ర సస్య రక్షణ విధానాలను సీటీఆర్ఐ అభివృద్ధి చేసింది.
- పొగాకు నర్సరీలో సూక్ష్మ, తుంపర్ల సాగు, బిందు సేద్యం ద్వారా నీటి యాజమాన్యం, సమర్థవంతంగా పోషకాల వినియోగం, ఆరోగ్యకరమైన నారు ఉత్పత్తి, మొక్కలు నాటడంలో ప్రాంతీయ అనుకూల సాంకేతిక పద్ధతుల అభివృద్ధి, జనుము పంట ద్వారా పచ్చిరొట్ట ఎరువు, భూసారానికి అనుగుణంగా ఎరువుల యాజమాన్యం, భౌతిక, రసాయనిక కలుపు నియంత్రణ పద్ధతులు, బోడుమల్లె యాజమాన్యం వంటి అనేక విధానాలను సీటీఆర్ఐ ప్రవేశపెట్టింది.
- నీటికుంటల యాజమాన్యం ద్వారా వర్షపు నీటి సేకరణ, పునర్వినియోగం, మల్చింగ్ విధానం ద్వారా సంరక్షణ, నేల సవరణల పద్ధతులు, పిలకల నియంత్రణలో రసాయనిక పద్ధతులు, సమర్థవంతంగా క్రిమి సంహారక మందుల వినియోగం, పొగాకులో పురుగు మందుల అవశేషాలను తగ్గించే వ్యూహాలు, ఇంటిగ్రేటెడ్ బార్న్ పద్ధతులు, బార్న్ రూఫ్ సీలింగ్, టర్బో ఫ్యాన్ అమరిక, ప్రత్యామ్నాయ ఇంధన వనరుగా అగ్రి బయోమాస్ బ్రికెట్స్ వినియోగం, నీటి నాణ్యత సూచికలు, పొగాకు నుంచి జీవ రసాయనాల తయారీ, ప్రత్యామ్నాయ ఎరువుల యాజమాన్యం, యాంత్రీకరణలో భాగంగా ట్రాన్స్‌ప్లాంటర్ల వినియోగం, టేల్ ప్రెస్సింగ్ యంత్రం ద్వారా కూలి ఖర్చు తగ్గింపు, ఉనోమ్ ఎడిటింగ్ ద్వారా క్యాన్సర్ కారకాల తగ్గింపునకు పరిశోధనల వంటి అనేక సేవలను ఈ సంస్థ అందిస్తోంది.
- పొగాకు నుంచి స్వచ్ఛమైన పోలెన్‌సాల్ ఉత్పత్తి, పొగాకు విత్తనాల నుంచి నూనె సేకరణ, హానికర పదార్థాల విశ్లేషణ వంటి విజయాలు కూడా సాధించింది.
- రైతులకు స్వచ్ఛమైన, అధిక దిగుబడిని ఇచ్చే నాణ్యమైన విత్తనాలు అందించే లక్ష్యంతో ఐసీఏఆర్ సంస్థ సీటీఆర్ఐకి 1990లలో రివాల్వింగ్ ఫండ్ స్కీమ్ (ఆర్ఎఫ్ పథకం) మంజూరు చేసింది. దీని ద్వారా ఎఫ్‌సీవీ, లంక పొగాకు రకాల విత్తనాలను సంస్థ ఉత్పత్తి చేస్తుంది. ఏటా నమోదైన సాగుదారులకు సిఫారసు చేసిన 13 వేల కిలోల ఎఫ్‌సీవీ విత్తనాన్ని సరఫరా చేస్తోంది.
- రైతులు ఆయా సీజన్లలో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలపై సలహాలు, సూచనలు అందిస్తోంది
- రైతులతో పాటు వ్యాపారులు, పొగాకు పదార్థాల తయారీదారులు, పొగాకు బోర్డు సిబ్బంది తమ సామర్థ్యం పెంచుకునేందుకు అవసరమైన తోడ్పాటు ఇస్తోంది. దీనికోసం క్షేత్ర స్థాయి ప్రదర్శనలు, వ్యక్తిత్వ సామర్థ్య నిర్మాణ కార్యక్రమాలు, వ్యాధి నిర్ధారణ సందర్శనలు, ఫీల్డ్ డేస్, రైతు సమ్మేళనాలు, ఫీల్డ్ ఫ్రెండ్స్ ప్రోగ్రాం, మోడల్ విలేజ్ కాన్సెప్ట్, క్వాలిటీ సర్కిల్స్, సైంటిస్ట్ – ఫార్మర్ – ట్రేడర్ – బోర్డ్ ముఖాముఖి, మొబైల్ యాప్‌లు, ఈ–పోర్టల్స్, వాట్సాప్ గ్రూప్స్ వంటివి నిర్వహిస్తోంది. రైతుల ప్రయోజనాల కోసం ఏటా 55 నుంచి 60 శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తోంది.
- ఇటువంటి చర్యలన్నీ పొగాకు రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ఎంతో తోడ్పతున్నాయి.
- ప్రస్తుతం పొగాకుతో పాటు వాణిజ్య వ్యవసాయంపై కూడా సీటీఆర్ఐ తన పరిశోధనలను కేంద్రీకరిస్తోంది. పొగాకుతో పాటు మిరప, పసుపు, ఆముదం, అశ్వగంధ వంటి వాటిపై పరిశోధనలు చేయడం ద్వారా రైతులకు మరింత మేలు చేసే దిశగా అడుగులు వేస్తోంది.

అంతర్ కళాశాలల అథ్లెటిక్ పోటీలు ప్రారంభం

ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల అథ్లెటిక్ పోటీలు స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో మంగళవారం ఉత్సాహంగా జరిగాయి. ప్రిన్సిపాల్ రాజబాబు అధ్యక్షతన జరిగిన ప్రారంభ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ పి.సువర్ణ, వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ పోటీల్లో 52 కళాశాలల నుంచి సుమారు 350 మంది క్రీడాకారులు పాల్గొన్నారని రాజబాబు తెలిపారు. కార్యక్రమంలో అర్బన్ సీఐ డి.సంజయ్‌కుమార్, రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ కేకే సంజీవరావు, ఇంటెలిజెన్స్ సీఐ వాసుబాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీ పీఏ కిషోర్‌బాబు, వ్యాయామ అధ్యాపకులు గంగన్న, డీవీడీ ప్రసాదరావు, ఎస్.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కార్తిక సందడి

- రత్నగిరికి ఈసారి తగ్గిన భక్తులు
- తెలంగాణ ఎన్నికలు, మిచాంగ్ తుపాను ప్రభావం
- వ్రతాల్లోనూ తగ్గుదల



ఆలయ ప్రాంగణంలో భక్తుల రద్దీ (ఫైల్)

అన్నవరం: సత్యదేవుని సన్నిధిలో కార్తిక సందడి ముగిసింది. గత నెల 13న కార్తిక శుద్ధ పాడ్యమితో రత్నగిరిపై ప్రారంభమైన ఆధ్యాత్మిక సందడికి మంగళవారంతో తెరపడింది. మొత్తం 30 రోజులకు గాను దాదాపు 20 రోజులు రత్నగిరి భక్తులతో కిటకిటలాడింది. అర్ధరాత్రి ఒంటి గంట నుంచి సాయంత్రం వరకూ వేలాదిగా భక్తులు తరలివచ్చారు. ఈసారి కార్తికంలో లక్షలాదిగా భక్తులు తరలివస్తారని అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. ఏటా కార్తికంలో తెలంగాణ నుంచి భక్తులు అధికంగా వస్తారు. అయితే ఆ రాష్ట్రంలో ఎన్నికల కారణంగా ఖమ్మం, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల సంఖ్య ఈ ఏడాది గణనీయంగా తగ్గింది. దీనికి తోడు గత వారం సంభవించిన మిచాంగ్ తుపాను ప్రభావంతో పలు రైళ్లు రద్దవడంతో గుంటూరు, నెల్లూరు, ప్రకాశం తదితర ప్రాంతాల నుంచి భక్తులు రాలేకపోయారు. అయితే నవంబర్ 27న కార్తిక పౌర్ణమి, సోమవారం ఒకే రోజు రావడంతో వెల్లువలా తరలి వచ్చిన భక్తజనంతో ఆలయం ప్రాంగణం ఇసుక వేస్తే రాలనంతగా కిక్కిరిసిపోయింది. సుమారు లక్షన్నర మంది భక్తులు రావడంతో వ్రతాల నిర్వహణ, స్వామివారి దర్శనానికి కూడా కొంతసేపు భక్తులను నిలిపివేయాల్సి వచ్చింది.

- కార్తికంలో సత్యదేవుని సుమారు 20 లక్షల మంది దర్శించారని అధికారులు అంచనా వేస్తున్నారు. మొదటి 15 రోజులు సుమారు 12 లక్షల మంది రాగా, చివరి 15 రోజులు 8 లక్షల మందికి పైగా వచ్చారు.
- ఈ ఏడాది కార్తికంలో సుమారు 1.25 లక్షల వ్రతాలు మాత్రమే జరిగాయి. అదే గత కార్తికంలో రికార్డు స్థాయిలో 1,42,378 వ్రతాలు జరిగాయి. అంటే ఈ ఏడాది సుమారు 17 వేల వ్రతాలు తగ్గాయి. తద్వారా ఆదాయం సుమారు రూ.85 లక్షల మేర తగ్గినట్టయ్యింది.
- ఈ ఏడాది ప్రసాదం అమ్మకాలు రికార్డు స్థాయిలో జరిగాయి. ప్యాకెట్ రూ.20 చొప్పున సుమారు 20 లక్షల ప్రసాదం ప్యాకెట్లు విక్రయించారు. సాధారణ రోజుల్లో 70 వేల నుంచి లక్ష, పర్వదినాల్లో లక్ష నుంచి 2 లక్షల ప్యాకెట్ల వరకూ ప్రసాదాలు తయారు చేశారు.
- ఈ కార్తికంలో రూ.20 కోట్లు పైగా ఆదాయం వస్తుందని అంచనా వేస్తున్నారు. గత ఏడాది కూడా ఇంతే ఆదాయం వచ్చింది. వాస్తవానికి ఏటా కార్తికంలో ఆదాయం పెరుగుతోంది. ఈసారి భక్తులు తగ్గడం, వచ్చిన వారిని కూడా రూ.300 టిక్కెట్‌తో ప్రదక్షిణ దర్శనం, రూ.200 టిక్కెట్‌తో స్పెషల్ దర్శనాలకు అనుమతించకపోవడంతో ఆదాయానికి రూ.కోటికి పైగా గండి పడే అవకాశం కనిపిస్తోంది.
- తొలి విడత హుండీల లెక్కింపు ద్వారా స్వామివారికి రూ.1.81 కోట్ల ఆదాయం వచ్చింది. త్వరలో చేపట్టే రెండో విడత లెక్కింపు ద్వారా మరో రూ.2 కోట్లు వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

ఉపయోగపడిన నిర్మాణాలు

పూర్వ ఈఓ చంద్రశేఖర్ ఆజాద్ చేపట్టిన అనేక నిర్మాణాలు కార్తిక మాసంలో భక్తుల రద్దీని తట్టుకునేందుకు చాలా ఉపయోగపడ్డాయి. ప్రధానంగా పాత సీఆర్ఓ కార్యాలయం వెనుక నుంచి రెండో ఘాట్ రోడ్డు వరకూ నిర్మించిన ఆదిశంకర మార్గ్ లింక్ రోడ్డు, ప్రకాష్ సదన్ సత్రం పక్క నుంచి నేరుగా పేపర్‌మిల్లు గార్డెన్ వద్దకు వాహనాలు వెళ్లేందుకు నిర్మించిన ర్యాంపు, ప్రత్యేక క్యూ లైన్లు, మల్టీ లెవెల్ పార్కింగ్, 30 వీఐపీ సత్రం స్థలంలో నిర్మించిన విశ్రాంతి షెడ్డు బాగా ఉపయోగపడ్డాయనే అభిప్రాయం వ్యక్తమైంది. నూతన ఈఓగా బాధ్యతలు స్వీకరించిన అడిషనల్ కమిషనర్ కె.రామచంద్ర మోహన్ కూడా దేవస్థానంలోని అన్ని విభాగాల్లో పర్యటిస్తూ భక్తులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకున్నారు. ప్రధానంగా పశ్చిమ రాజగోపురం వద్దకు దేవస్థానం బస్సులు, మినీ వ్యాన్లు నడపడం వలన భక్తులకు నడవాల్సిన బాధ తప్పింది. కంపార్ట్‌మెంట్ పద్ధతితో భక్తులు ఇబ్బంది పడుతూండటంతో నేరుగా క్యూ లైన్ల ద్వారానే స్వామివారిని భక్తులు దర్శించేలా ఏర్పాటు చేశారు.

ముగిసిన వెయిట్ లిఫ్టింగ్ పోటీలు

- మెన్, వుమెన్ టీమ్ చాంపియన్లుగా తిరువళ్లూరు, మంగుళూరు వర్సిటీలు
- స్ట్రాంగ్ మన్, వుమన్‌లుగా అలోక్ యాదవ్, అనూష

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో నాలుగు రోజుల పాటు తొలిసారిగా నిర్వహించిన సౌత్, వెస్ట్ జోన్ అంతర్ విశ్వవిద్యాలయాల మెన్ అండ్ వుమెన్ వెయిట్ లిఫ్టింగ్ పోటీలు మంగళవారం విజయవంతంగా ముగిశాయి. విజేతలకు ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు మెడల్స్, ట్రోఫీలు బహూకరించారు. ఈ సందర్భంగా జరిగిన ముగింపు సభలో ఆయన మాట్లాడుతూ, వర్సిటీ చరిత్రలో ఈ పోటీలు మైలురాయిగా నిలుస్తాయని అన్నారు. 11 రాష్ట్రాల నుంచి సుమారు 800 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారన్నారు. ఈ పోటీల నిర్వహణ ద్వారా వర్సిటీ ఖ్యాతి దేశవ్యాప్తంగా విస్తరించిందన్నారు. ఇదే స్ఫూర్తితో మున్ముందు మరిన్ని పోటీలు నిర్వహించేందుకు వర్సిటీ సిద్ధమవుతుందని చెప్పారు.

ఉదయం నుంచి సాయంత్రం వరకూ..

పోటీల్లో నాలుగో రోజైన మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ 96, 102, 109, 109+ కేటగిరీల్లో పోటీలు జరిగాయి. మెన్ 96 కిలోల విభాగంలో అలోక్ యాదవ్ (జైన్ యూనివర్సిటీ), ఎ.కోమల్ కార్తీక్, ఎం.అశోక్ (ఆచార్య నాగార్జున); 102 కిలోల కేటగిరీలో జె.మధుబాబు (ఆదికవి నన్నయ), ఎన్.నింగన్‌గౌడ్ (కర్ణాటక), ఎం.రాకేష్ (తిరువళ్లూరు); 109 కిలోల కేటగిరీలో ప్రత్యూష (మంగుళూర్), దేవేంద్రసింగ్ (రాజస్థాన్), భోయ్ విష్ణు కైలాస్ (కవయిత్రి భాసినాభాయ్ చౌదరి వర్సిటీ); 109+ కేటగిరీలో వినోద్ లకాని (జై నారాయణ్ వ్యాస్ వర్సిటీ), కుశాల్ గౌడ్ (జైన్), జి.యోగేష్ (పాండిచ్చేరి) వరుస మూడు స్థానాల్లో నిలిచి బంగారు, వెండి, కాంస్య పతకాలు అందుకున్నారు.



మెన్ టీమ్ చాంపియన్ తిరువళ్లూరు వర్సిటీ జట్టుకు ట్రోఫీ అందిస్తున్న వీసీ ఆచార్య పద్మరాజు

ఉత్తమ వెయిట్ లిఫ్టర్లు

మెన్ బెస్ట్ లిఫ్టర్‌గా ఆకాష్ శ్రీనివాస్‌గౌడ్ (నాందేడ్ యూనివర్సిటీ), వుమెన్ బెస్ట్ లిఫ్టర్‌గా బి.రాజేశ్వరి (ఆదికవి నన్నయ) ట్రోఫీలు అందుకున్నారు. అలాగే మెన్ టీమ్ చాంపియన్‌షిప్ విన్నర్‌గా తిరువళ్లూరు యూనివర్సిటీ, రన్నర్‌గా మంగుళూరు యూనివర్సిటీ ట్రోఫీలు పొందాయి. వుమెన్ టీమ్ చాంపియన్‌షిప్ విన్నర్‌గా మంగుళూరు యూనివర్సిటీ, రన్నర్‌గా సావిత్రీభాయ్ పూలే యూనివర్సిటీ నిలిచాయి. స్ట్రాంగ్ మన్‌గా అలోక్ యాదవ్ (జైన్), స్ట్రాంగ్ వుమన్‌గా ఎం.అనూష (కాకతీయ) ట్రోఫీలను కైవసం చేసుకున్నారు.

ఉపాధికి వెళ్తూ.. మృత్యులోకాలకు..

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం
- మరొకరికి తీవ్ర గాయాలు
- పశ్చిమ గోదావరి జిల్లాలో దుర్ఘటన



మొగల్తూరు మండలం దారితిప్ప గ్రామం వద్ద లారీ ఢీకొని నుజ్జయిన ట్రక్ ఆటో



యల్లమిల్లి రవికుమార్



పోలుమాటి శ్రీను

ఉండ్రాజవరం: జీవనోపాధి కోసం బయలుదేరిన వారు.. అట్నుంచి అటే మృత్యులోకాలకు చేరుకున్నారు. స్థానికుల కథనం ప్రకారం.. తూర్పు గోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలం వెలగదుర్రు గ్రామానికి చెందిన యల్లమిల్లి రవికుమార్ (38), పోలుమాటి శ్రీను (37), చోరపల్లి వీరబాబులు నాటుకోళ్లకు గాబులు (మెష్ గాబులు) కడుతూంటారు. ఫోన్‌లో ఆర్డర్లు బుక్ చేసుకుని ట్రక్ ఆటోలో మెష్‌లు వేసుకుని, ఆర్డర్లు ఇచ్చిన ప్రాంతానికి వెళ్లి నాటు కోళ్లకు గాబులు కడతారు. తద్వారా వచ్చిన డబ్బులతో కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఇదేవిధంగా సోమవారం ఈ ముగ్గురూ ట్రక్ ఆటోలో మెష్‌లు పట్టుకుని బాపట్ల జిల్లా రేపల్లె మండలంలోని చుట్టుపక్కల గ్రామాలకు బయలుదేరారు. అర్ధరాత్రి పశ్చిమ గోదావరి జిల్లా మొగల్తూరు మండలం దారితిప్ప గ్రామం వద్ద 216 జాతీయ రహదారిపై వారి ఆటోను లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో రవికుమార్, శ్రీను అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నర్సాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన వీరబాబు విజయవాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ సంఘటనతో మృతుల కుటుంబాల్లో విషాద ఛాయలు అలముకున్నాయి. రెక్కాడితేనే కానీ డొక్కాడని ఆ కుటుంబాల్లో ఈ ప్రమాదం తీరని విషాదాన్ని నింపింది. మృతులు రవికుమార్, శ్రీను వివాహితులు, ఇద్దరికీ చెరో ఇద్దరు చొప్పున పిల్లలున్నారు. రవికుమార్, శ్రీను మృతితో కుటుంబ సభ్యులతో పాటు భార్య, పిల్లలు రోదిస్తున్నారు. అందరితోనూ ఆప్యాయంగా ఉండే వారు.. ఈ ప్రమాదంలో మృతి చెందడంతో గ్రామస్తులు, బంధువులు కన్నీరుమున్నీరు అవుతున్నారు.

చిన్నారిపై కుక్క దాడి



కుక్క దాడిలో గాయపడిన చిన్నారి

గోకవరం: వీధి కుక్క దాడిలో ముక్కుపచ్చలారని మూడేళ్ల చిన్నారి తీవ్రంగా గాయపడింది. గోకవరం వెలమపేటకు చెందిన పోచమ్మ కుమార్తె అక్షయ శివజ్యోతి మంగళవారం ఇంటి బయట ఆడుకుంటూండగా వీధి కుక్క దాడి చేసింది. కుక్క ఆ చిన్నారి జుట్టు పట్టుకుని ఈడ్చుకుని వెళ్తూండగా.. స్థానికులు వెంబడించి విడిపించారు. తీవ్రంగా గాయపడిన బాలికను కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆస్పత్రి సిబ్బంది వెంటనే ఆ చిన్నారికి వైద్యం చేశారు.